క్లుప్తంగా

నవధాన్యాల సాగు పరిశీలన



రైతులకు సూచనలిస్తున్న డీపీఎం ఆనందరావు

బొబ్బిలి రూరల్: మండలంలోని జగన్నాథపురం రైతులు పండిస్తున్న నవధాన్యాల పంటల సాగును జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం ఆనందరావు శనివారం పరిశీలించారు. గ్రామంలోని రైతులతో మాట్లాడి విత్తనాలు చల్లే విధానం, అందించాల్సిన పోషకాలు, చీడపీడల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మొక్కదశలో ఉన్న పంటలను ఏవిధంగా రక్షించుకోవాలి, నీటి తడులు ఎప్పుడు అందించాలో వివరించారు. ఆయన వెంట వీఏఏ ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి శంకరరావు, ఐసీఆర్పీలు ఉన్నారు.

పశుగ్రాస విత్తనాల పంపిణీ



పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ విజయబాబు

తెర్లాం: రాయితీపై పంపిణీ చేస్తున్న పశుగ్రాస విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కూనాయవలస సర్పంచ్ బోడెల విజయబాబు అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద శనివారం పాడిరైతులకు పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ.. పశు పోషణ నిమిత్తం పాడిరైతలకు అవసరమైన పశుగ్రాస విత్తనాలను ప్రభుత్వం రాయితీపై అందిస్తోందన్నారు. కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రానికి వచ్చి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎంఏ స్వామి, సచివాలయ పశుసంవర్ధక శాఖ సహాయకులు రాలు, రైతులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న రియాజ్‌ఖాన్

బొబ్బిలి: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ నేటి తరానికి ఆదర్శప్రాయుడని మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ రియాజ్‌ఖాన్ అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని రాష్ట్రీయ రహదారిలో ఉన్న ఆయన విగ్రహానికి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోదుడిగా, సంఘ సంస్కర్తగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయన దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందారన్నారు. ఆయనను నేటి తరం ఆదర్శంగా తీసుకుని మంచి బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు పట్టణ వాసులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



బుచ్చినాయుని కోనేరు గట్టుపై కొబ్బరి మొక్కలు నాటుతున్న దృశ్యం

తెర్లాం: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని రంగప్పవలస సర్పంచ్ శనపతి రాంబాబు అన్నారు. గ్రామంలోని బుచ్చినాయుని కోనేరు, వేపకార చెరువు గట్లపై కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గ్రామం పరిధిలోని అన్ని చెరువు గట్లపై ఇప్పటికే పలు రకాల ఉద్యానవన మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నామన్నారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని కోరారు. గ్రామంలోని నాటిన కొబ్బరి, పండ్ల మొక్కల ద్వారా పచ్చదనం పెంపొందడంతో పాటు భవిష్యత్‌లో పంచాయతీకి అదనపు ఆదాయం చేకూరుతుందన్నారు.

పఠనాసక్తిని పెంపొందించేలా బోధన



పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరాలు వెల్లడిస్తున్న ఎంఈఓలు

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు, పఠనాసక్తిని పెంపొందించే మార్గాలు అన్వేషించాలని ఎంఈఓలు బి.ప్రవీణ్‌కుమార్, యాగాటి దుర్గారావు ఉపాధ్యాయులకు సూచించారు. చీపురుపల్లి రోడ్డులోని శ్రీవత్సల హైస్కూల్‌లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు జరుగుతున్న 'సపోర్టివ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రైనింగ్ ప్రోగ్రాం'ను శనివారం పరిశీలించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. టెక్నాలజీని వినియోగించుకుంటూ విద్యార్థుల్లో ఆయా సబ్జెక్టుల పట్ల ఆసక్తి కలిగేలా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ మాస్టార్లు రవిశంకర్, గురుమూర్తి, సత్యనారాయణ, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జునోసిస్ వ్యాధులపై అవగాహన అవసరం



తెర్లాం: పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ జె.నరేంద్రకుమార్



సంతకవిటి: శునకాలకు టీకాలు వేస్తున్న డాక్టర్ ఎం.అనిల్‌కుమార్



రాజాం సిటీ: పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న ఏడీ జయప్రకాష్

రాజాం సిటీ/సంతకవిటి/తెర్లాం/బాడంగి: జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పశువైద్యాధికారులు సూచించారు. ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా శనివారం అన్ని మండలాల్లోని పశువైద్య కేంద్రాల్లో పెంపుడు శునకాలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పెంపుడు జంతువులకు సకాలంలో టీకాలు వేయించాలని, ఈ విషయంలో యజమానులు నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. జంతువులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించి చికిత్స అందించాలన్నారు.



బాడంగి: బాడంగిలో కుక్కలకు టీకాలు వేస్తున్న డాక్టర్ సతీష్

రాజకీయాలు పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి పెడదాం..

● ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

బాడంగి: మండల సర్వతోముఖాభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే రంగారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ముగిసి పోయాయని, ఇకమీదట రాజకీయాలు వదిలేసి అభివృద్ధిపై దృష్టి పెడదామని ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. ప్రతిపక్ష నాయకులు మండంలో చేపట్టే అభివృద్ధి పనులకు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, రక్షిత పథకాల ట్యాంకులు శుభ్రం చేయాలని, ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రైతులకు ఖరీఫ్‌లో సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పారాది ఆనకట్ట నుంచి పాల్తెరు ఛానల్ ద్వారా చెరువుల్లో నీరు నింపుకోవాలన్నారు. అనంతరం ఎన్నికల తరువాత జరిగిన తొలి సమావేశం కావడంతో మండల పరిషత్ సభ్యులు, అధికారులు కలిసి ఎమ్మెల్యే బేబీనాయనను సత్కరించారు. అంతకుముందు వివిధ శాఖల ప్రగతి నివేదికలను ఆయా శాఖల అధికారులు చదివి వినిపించారు. సభ్యులు గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, వైస్ ఎంపీపీలు భాస్కరరావు, రమేష్, ఎంపీడీఓ ఆంజనేయులు, తహసీల్దార్ రాజారావు, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ప్రధాన సమస్యలు పరిష్కరిస్తాం..

స్థానిక సీహెచ్‌సీలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు(బేబీనాయన) హామీ ఇచ్చారు. సీహెచ్‌సీని శనివారం ఆయన సందర్శించారు. ముందుగా కొత్తగా నిర్మిస్తున్న 50 పడకల ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. పనులు మధ్యలో ఆగిపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. రోగులకు మరింత నాన్యమైన వైద్యసేవలందేలా చూస్తామన్నారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే తెంటు లక్షుంనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు తెంటు రవిబాబు, ఎల్.సత్యం, మాజీ ఎంపీపీ బొంతు త్రినాథనాయుడు, ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ కండి రమేష్, పలువురు అధికారులు ఉన్నారు.

అర్హులైన కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు



తెర్లాం: రంగప్పవలసలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ సునీల్‌కుమార్



రేగిడి: బూరాడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ చంద్రరావు

తెర్లాం: మండలంలో అర్హులైన ప్రతీ కౌలు రైతుకి కౌలుకార్డులు(సీసీఆర్‌సీ) పంపిణీ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి జి.సునీల్‌కుమార్ అన్నారు. రంగప్పవలస గ్రామంలో వీఆర్వో సువ్వాడ నరసింహనాయుడు ఆధ్వర్యంలో శనివారం కౌలు రైతుల గుర్తింపు కార్డులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. భూమిని కౌలుకు తీసుకుని చేస్తున్న ప్రతి రైతు గుర్తింపు కార్డు కోసం స్థానిక రైతు సేవా కేంద్రాల్లో గానీ, వీఆర్వో వద్ద గానీ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్డు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.

రైతులు ఆందోళన చెందవద్దు

రేగిడి: కౌలుకు భూములు ఇస్తున్న రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని రాజాం వ్యవసాయశాఖ ఏడీఏ కె.చంద్రరావు అన్నారు. మండలంలో బూరాడ, లింగాలవలస, తోకలవలస తదితర గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో శనివారం సీసీఆర్‌సీ కార్డులపై రైతులకు అవగాహన కల్పించారు. కౌలు రైతులకు ఇచ్చే హక్కు పత్రాలు తాత్కాలకమేనని, వాటిపై ఎటువంటి అపోహలు వద్దని సూచించారు. రైతుల అనుమానాలను నివృత్తి చేశారు. కౌలు గుర్తింపు కార్డులు కలిగిన రైతులకు ప్రభుత్వం రాయితీపై ఎరువులు, పురుగుమందులు ఇస్తుందన్నారు. మండలంలో ఇప్పటివరకు 82 మంది కౌలు రైతులను గుర్తించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ, వీఏఏలు పాల్గొన్నారు.

● వంగర: అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందిస్తామని ఏవో తట్టికోట కన్నబాబు అన్నారు. మద్దివలస, సంగాం గ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. కౌలు గుర్తింపు కార్డులపై రైతులకు అవగాహన కల్పించారు. భూమిని కౌలుకు ఇస్తున్న రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వీఏఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

రేగిడి: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది సూచించారు. మండలంలోని బూరాడ, ఉనుకూరు, రేగిడి సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై మహిళలు, గర్భిణులు, బాలింతలకు శనివారం అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ ఆహార పదార్థాలను తీసుకోవద్దని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీలింగ్ ఫ్యాన్ల వితరణ



గురుకులానికి అందించిన ఫ్యాన్లతో రోటరీ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు

రాజాం సిటీ: స్థానిక రోటరీక్లబ్ సభ్యులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఉంగరాడ మెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులానికి 10 సీలింగ్ ఫ్యాన్లు వితరణ చేశారు. ప్రిన్సిపాల్ సూర్యనారాయణకు శనివారం వాటిని అందించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు మక్క అప్పలనాయుడు, గట్టి పాపారావు, మల్లా శేషగిరి, తోట తిరుమలరావు, అధ్యాపకులు శ్రీనివాసరావు, సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

రేగిడి: కిశోర బాలికలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, ఒత్తిడికి గురికావద్దని ఐసీడీఎస్ కార్యకర్తలు ఎస్.శైలజ, రాణిరత్నం, భాను, జయలక్ష్మి, ముత్యాలరత్నం, పుణ్యవతి సూచించారు. మండలంలో ఉంగరాడ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థినిలకు కౌమార దశలో శరీరంలో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సీడీపీఓ డాక్టర్ కనకదుర్గ ఆదేశాలతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

రాజాం సిటీ: మండలంలోని ఒమ్మి పంచాయతీ నరసింహపురం గ్రామానికి చెందిన ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసులు నమోదు చేశామని సీఐ డి.మోహనరావు శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన బూరాడ నరసింగరావు, అతని చిన్నాన్న ఆదినారాయణల మధ్య అన్నదమ్ముల వాటా భూమితో పాటు అందులో వేసిన పంట విషయంలో తగాదా వచ్చింది. ఈ క్రమంలో ఆ భూమిలో వేసిన జొన్నపంటను ఆదినారాయణ కుమారుడు తొలగించడంతో ఇరువర్గాలు కొట్లాటకు దిగారు. ఇరువర్గాల వారు గాయాలతో రాజాం సామాజిక ఆస్పత్రిలో జాయిన్ అయ్యారు. ఆస్పత్రి వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు ఇరువర్గాలపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

డయేరియాను నిర్మూలిద్దాం..



గోడపత్రికలు విడుదల చేస్తున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ, తదితరులు

రామభద్రపురం: స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని నాయుడువలస సచివాలయం వద్ద ఈవోపీఆర్డీ వెంకటరమణతో కలిసి శనివారం స్టాప్ డయేరియా కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యాధికారుల పర్యవేక్షణలో ఎల్‌హెచ్‌పీలు, ఆశా, ఏఎన్‌ఎంలు కలిసి ఇంటింటికీ వెళ్లి డయేరియా లక్షణాలు, వ్యాధి వ్యాప్తికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జనావాసాల మధ్య మురుగునీరు నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని చెత్తశుద్ధి కేంద్రం, మంచినీటి పథకం ట్యాంకు పరిసరాలను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కార్యదర్శికి సూచించారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

● డీఈవో ప్రేమ్‌కుమార్



బూసాయవలస కేజీబీవీలో విద్యార్థినుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

రామభద్రపురం: పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాబోధన చేయాలని డీఈవో ప్రేమ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆరికతోట ఉన్నత పాఠశాల, బూసాయవలస కేజీబీవీ పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం బాగుంటుందా? ఉపాధ్యాయులు అర్థమయ్యేలా పాఠాలు చెపుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పిల్లలకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థుల విద్యా సామర్థ్యాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని, సమయపాలన పాటించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

సాయన్న గెడ్డను ఆధునీకరించండి



మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు

సంతకవిటి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ సిరిపురపు మంజు అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. నీటి పారుదల శాఖపై జరిగిన సమీక్ష సందర్భంగా జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు మాట్లాడుతూ సాయన్న గెడ్డ ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని, వరదల సమయంలో పంటలు నీట మునిగి రైతులు నష్టపోతున్నారని అన్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా మందులు అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి అధికారులు సూచించారు. పశు సంవర్ధక శాఖపై సమీక్షలో గొర్రెలకు టీకాలు వేయాలని గోళ్ళవలస సర్పంచ్ కోరడంతో, ఇంకా టీకాలు రాలేదని వచ్చిన వెంటనే టీకాలు వేస్తామని పశు వైద్యాధికారి తెలిపారు. గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం సర్పంచ్‌లకు తెలియకుండా నిర్వహించడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశామని, సమాచారం అందించని సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీడీఓ జి.పైడితల్లి, తహసీల్దార్ సీహెచ్.తిరుమలరావు, ఎస్సై షేక్ శంఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

రాజాం సిటీ: పట్టణానికి చెందిన వెంకటేష్, లక్ష్మీసోమిదేవి అనే ప్రేమ జంట శనివారం పోలీసులను ఆశ్రయించారు. తాము గత మూడేళ్లుగా ప్రేమించుకుంటున్న విషయాన్ని పెద్దలకు తెలియజేశామని, అయినా వారు అంగీకరించలేదని మీడియాకు తెలిపారు. దీంతో చేసేదేమీలేక గత నెల 5న అన్నవరం గుడిలో వివాహం చేసుకున్నట్లు చెప్పారు. పెళ్లైన వారం రోజులు తరువాత రాజాం వచ్చి వేరే ఇంట్లో ఉంటున్నామని, అప్పటి నుంచి అమ్మాయి తల్లిదండ్రులతో పాటు బంధువులు మమ్మల్ని ఫోన్లో బెదిరిస్తున్నారని వాపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్తుండగా తన భర్తపై దాడిచేశారని లక్ష్మి వాపోయింది. తమకు మా తల్లిదండ్రులు, బంధువుల నుంచి ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఇదే విషయమై టౌన్ సీఐ మోహనరావు వద్ద ప్రస్తావించగా ఇరువురు మేజర్లు కావడంతో వారిపై ఎటువంటి చర్యలకు పాల్పడవద్దని వారి తల్లిదండ్రులకు సూచించినట్లు చెప్పారు. కాదని ఎటువంటి దాడులకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొత్త చట్టాలపై అవగాహన

బొబ్బిలి: ఇటీవల భారతీయ చట్టాల్లో వచ్చిన మార్పులను ప్రజలంతా తెలుసుకుని వాటికి అనుగుణంగా నడచుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వాసు కాలేజీలో విద్యార్థులకు కొత్త చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. కొత్తగా వచ్చిన మోటారు వెహికల్ చట్టాలను విద్యార్థులు అర్థం చేసుకుని సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో సీఐ ఎం.నాగేశ్వరరావు, ఎస్సై జి.లోవరాజు, వాసు కాలేజ్ కరస్పాండెంట్ ఆర్.వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

రాజాం సిటీ: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రాజాం సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్. వివేక్ ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక కోర్టు సముదాయంలో బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసులకు ట్రాఫిక్ నిబంధనలు, వాహన చట్టాలపై శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు డ్రైవింగ్‌లో సీటు బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను కచ్చితంగా పాటించాలని సూచించారు. డ్రైవింగ్‌లో జాగ్రత్తలు పాటించడం ద్వారా కుటుంబ సభ్యులకే కాకుండా తోటివారికి కూడా మేలు చేసినట్టేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు కె.రామినాయుడు, వై.ఈశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, ప్రభుత్వ న్యాయవాది ఎస్.పోలారావు తదితరులు పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

వంగర: మండలంలోని మద్దువలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.పద్మావతి శనివారం తెలిపారు. ఐదో తరగతిలో 25 సీట్లుండగా, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో నాలుగు సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 9న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఐదో తరగతి సీట్లు లాటరీ పద్ధతిన, పదోతరగతి మార్కుల మెరిట్ ఆధారంగా ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

ప్లాస్టిక్ సంచులు వినియోగించొద్దు



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం: నిషేధిత ప్లాస్టిక్ సంచులు వినియోగించవద్దని వ్యాపారులకు మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో రాజాం పట్టణానికి చెందిన వ్యాపారులతో శనివారం సమావేశం నిర్వహించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్(ఎస్‌యూపీ) చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. వీటిని వినియోగిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. వర్షాకాలం కావడంతో డయేరియా వంటి ప్రమాదకర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్, ఎన్విరాన్‌మెంటల్ ఏఈ భాగ్యలక్ష్మి, రెడ్‌క్రాస్ ప్రతినిధి కొత్తా సాయిప్రశాంత్ కుమార్, వికాస తరంగణి రాష్ట్ర సంస్కార్ అధ్యక్షులు టీటీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం..

● మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: ఈనెల 8న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులన్నీ సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో శనివారం సమావేశమై కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. 8న ఉదయం 9.30 గంటలకు స్థానిక అమ్మిగారి కోనేటిగట్టు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పట్టణంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే అన్ని మండల కేంద్రాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటి గోపాలరావు, రాష్ట్ర ఆర్థిక మండలి మాజీ సభ్యులు తూముల భాస్కరరావు, నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌ఛార్జి శంబంగి వేణుగోపాలనాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళీ కృష్ణ, రామభద్రపురం ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, జేసీఎస్ ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● బాడంగి: మండలంలో ఈ నెల8న నిర్వహించే వైఎస్సార్ జయంతి వేడుకల్లో పార్టీ శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలని మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు శనివారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయిస్తే చర్యలు

● డీఈఓ ప్రేమ్‌కుమార్



గొల్లపల్లి వేణుగోపాల మున్సిపల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

బొబ్బిలి: ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈఓ ప్రేమ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని సురేష్ స్కూల్‌లో పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్నారన్న వచ్చిన ఆరోపణలపై శనివారం ఆయన విచారణ చేపట్టారు. విద్యార్థులు, వారి తల్లి దండ్రులను విచారించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. అనంతరం ప్రభుత్వ బాలికల పాఠశాలను సందర్శించి అక్కడి ఉపాధ్యాయులతో మాట్లాడారు. బోధనపై దృష్టి సారించాలన్నారు. అనంతరం అక్కడి నుంచి గొల్లపల్లిలోని శ్రీవేణుగోపాల మున్సిపల్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. యూనిఫాంలను పంపిణీపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజన వంటకాలను రుచి చూశారు. ఆయన వెంట ఎంఈఓలు చల్ల లక్ష్మణరావు, గొట్టాపు వాసు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.